క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం పరిశీలన

జుజ్జూరు(వీరులపాడు): విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించాలని ఎంఈవో పాల్‌కెనడీ సూచించారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథక ఏజెన్సీ నిర్వాహకులు విద్యార్థులకు అందించే ఆహార తయారీలో పరిశుభ్రత పాటించాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం ఆయన పాఠశాల రికార్డులను పరిశీలించారు.

పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతం : ఏవో

కంచికచర్ల: పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతమవుతుందని కంచికచర్ల మండల వ్యవసాయ అధికారి కె.విజయకుమార్ సూచించారు. ఆయన బుధవారం మాట్లాడుతూ జీలుగు సాగు వల్ల అనేక ప్రయోజనాలున్నాయన్నారు. ఖరీఫ్ సాగులో ముందుగా జీలుగును సాగుచేసి పెరిగిన జీలుగును కలియదున్నితే భూమి మరింత సారవంతమవుతుందన్నారు. నేలకు నత్రజని, ఫాస్పేట్ అందుతాయన్నారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని 15శాతం తగ్గిస్తుందని పేర్కొన్నారు. ఆకుమడులు పూర్తిచేయడంతోపాటు లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. ఆయా విత్తనాల కొనుగోళ్లకు సంబంధించిన రశీదులను పంటకాలం పూర్తయ్యేవరకు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని ఏవో సూచించారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

నందిగామ: పట్టణ శివారు పల్లగిరిగుట్టపై గల త్రిశక్తి పీఠంలో 9వ వార్షిక మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడురోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా ఆలయంలోని కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞాన సరస్వతి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించడంతోపాటు శ్రీ రాజశ్యామల సహిత రుద్రయాగ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. లోకశాంతిని కాంక్షిస్తూ ఈసారి రాజశ్యామల రుద్రయాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు రాజేష్‌శర్మ తెలిపారు. భక్తులు హాజరుకావాలని కోరారు.

పుస్తకాల పంపిణీ



నందిగామ: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, మండలంలోని ఐతవరం, మాగల్లు పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్‌తో కూడిన స్టూడెంట్ కిట్లను బుధవారం పంపిణీ చేశారు. చందర్లపాడు మండలంలోని కోనయపాలెం, గుడిమెట్ల గ్రామాల విద్యార్థులకు కూడా స్టూడెంట్ కిట్లను అందజేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన సదస్సు



జగ్గయ్యపేట అర్బన్: సికిల్ సెల్ అనీమియా(రక్తహీనత)పై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య సూచించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సికిల్ సెల్ అనీమియాపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా ఆస్పత్రి సూపరిండెంట్ హరీష్ మాట్లాడుతూ రక్తహీనత అనేది ఒక జన్యు సంబంధ వ్యాధి అని, ఈ వ్యాధిని నిర్ధారించడానికి రక్త పరీక్షలు అవసరమన్నారు.ఈ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో సీహెచ్‌సీ, పీపీ యూనిట్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిగామ: నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల్లో గురువారం ఐదుగంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆశాఖ డీఈ వి.రమేష్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నందిగామ మండలం చందాపురం సమీపంలోని సబ్ స్టేషన్ లో మరమ్మత్తులు నిర్వహించనున్నందున నందిగామ పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాలు, చందర్లపాడు, వీరులపాడు మండలాల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు వివరించారు. వినియోగదారులు సహకరించాలని డీఈ కోరారు.

పొలంబాట పట్టిన రైతులు



నందిగామ సమీపంలో పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

నందిగామ: ఆలస్యమైనా వరుణుడు కరుణించడంతో నియోజకవర్గ రైతులు పొలంబాట పట్టారు. అదను దొరకక నిన్నమొన్నటి వరకు ఖాళీగా ఉన్న రైతులు, ప్రస్తుతం ఆయా వ్యవసాయపనుల్లో బిజీగా మారారు. రుతుపవనాల ప్రభావంతో మంగళవారం నందిగామ ప్రాంతంలో భారీవర్షం కురిసింది. ఈ నేపథ్యంలో రైతులు పొలం పనులకు శ్రీకారం చుట్టారు. నందిగామ మండలంలోని పలు గ్రామాల పరిధిలోని రైతులు, వ్యవసాయ కూలీలు బుధవారం పొలం పనుల్లో నిమగ్నమై కనిపించారు. కొందరు రైతులు ఇప్పటికే వేసవి దుక్కులు దున్ని ఉంచిన పొలాలను శుభ్రం చేస్తున్నారు. ఇంకొందరు రైతులు విత్తనాలను విత్తే పనులు ప్రారంభించారు. మరికొందరు రైతులు పొలం చుట్టూ రక్షణ కంచె వంటి పనులు చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు వెలవెలబోయిన పొలాలు ఈ వర్షాల కారణంగా నేడు రైతులు, వ్యవసాయ కూలీలతో కోలాహలంగా మారాయి.

6500 ఎకరాల్లో పెసరసాగు..

కంచికచర్ల : ఎట్టకేలకు వరుణుడు కరుణించడంతో కంచికచర్ల మండల రైతులు వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. రెండురోజులుగా వర్షాలు కురుస్తుండటంతో అన్ని గ్రామాల్లో రైతులు మెట్ట పైర్లు సాగుచేసేందుకు ట్రాక్టర్ల ద్వారా పెసర విత్తనాలు ఎదపెడుతున్నారు. పత్తి, మొక్కజొన్న విత్తనాలను నాటుతున్నారు. గతనెలలో ముందుగానే పంట పొలాల్లో సేంద్రీయ ఎరువులతోపాటు చెరువుల్లోని నల్ల మట్టిని తోలుకుని సాగుచేసేందుకు సిద్ధం చేశారు. కంచికచర్ల మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 6,500వేల ఎకరాల్లో పెసర పంట సాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.



అడవిరావులపాడులో పొలం దున్నుతున్న రైతు

పెసర, మొక్కజొన్న సాగుకు ఆసక్తి..

ఈ ఏడాది మండలంలో పత్తి పంట సాగుచేసేందుకు ఎక్కువమంది రైతులు ఆసక్తి చూపించడం లేదు. గతేడాది రైతులు సాగుచేసిన పత్తి పంటకు గులాబీరంగు కాయతొలుచు పురుగు ఆశించడంతో చేతికొచ్చిన పంట పూర్తిగా దెబ్బతిని ఆశించిన మేర దిగుబడి రాలేదు. దీంతో పత్తి పంట సాగుచేసేందుకు కొంతమంది రైతులు ముందుకు రావటం లేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది మెట్ట పంటలు పెసర, మొక్కజొన్న, మిర్చి పంటలు సాగుచేసేందుకు రైతులు ఎక్కువగా మక్కువ చూపిస్తున్నారు.





మాగల్లు గ్రామ పరిధిలో పొలాలను సాగుకు సిద్ధం చేస్తున్న రైతులు



కంచికచర్లలో ట్రాక్టర్‌తో పెసర విత్తనాలను ఎదపెడుతున్న రైతు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

ఎమ్మెల్యే తాతయ్య

జగ్గయ్యపేట అర్బన్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని, విద్యార్థులంతా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాల కిట్లను బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ విద్యార్థులంతా చదువులో చక్కగా రాణించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. అనంతరం ఆయన నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనంలో నాడు-నేడు పనులను పరిశీలించారు.

జగ్గయ్యపేట మండలంలో...

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ బుధవారం పుస్తకాల కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు సుదానంద్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గండ్రాయిలో..

గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు విద్యాకమిటీ చైర్మన్ రమాదేవి బుధవారం పుస్తకాల కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నేలవెల్లి రమేష్‌బాబు, ఉపాధ్యాయులు జ్యోతికుమారి, సుబ్బారావు, గ్రామ పెద్దలు సత్యనారాయణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



చిల్లకల్లులో బ్యాగ్, పుస్తకాలతో కూడిన కిట్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

పెనుగంచిప్రోలు మండలంలో..

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాల(మెయిన్)లో విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలతోపాటు యూనిఫాం, బ్యాగ్, బెల్ట్‌లతో కూడిన స్టూడెంట్ కిట్‌లను బుధవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచిపౌరులుగా ఎదగాలన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు పి విజయలక్ష్మి, హెచ్‌ఎం జి.వెంకటేశ్వరరావు, ఆలయ మాజీ చైర్మన్ అత్తలూరి అచ్యుతరావు పాల్గొన్నారు.



అనిగండ్లపాడులో కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచి జ్యోతిబ్రహ్మం



ముండ్లపాడులో కిట్లు అందజేస్తున్న గూడపాటి, వాసు తదితరులు

ముండ్లపాడులో...

స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, ఉప సర్పంచి గుత్తా శ్రీనివసరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నరాల మధుసూదనరెడ్డి, హెచ్‌ఎం వేల్పుల సుందరరావు, నాయకులు చంద్రుపట్ల లక్ష్మీనరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సున్నితమైన హాస్యానికి చిరునామా జంధ్యాల

విజయవాడ కల్చరల్: సున్నితమైన హాస్యానికి చిరునామా దర్శకుడు జంధ్యాల అని సీనియర్ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. కళామంజరి సాంస్కృతిక సేవా సంస్థ, అభిరుచి, సి. రామ్మోనరావు కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలోని సినీ దర్శకుడు, నటుడు, మాటల రచయిత జంధ్యాల విగ్రహం వద్ద బుధవారం 23వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుప్తా మాట్లాడుతూ కుటుంబ సమేతంగా చిత్రాలకు దర్శకత్వం వహించిన జంధ్యాల జీవితం నగరంతో ముడిపడి ఉండటం విశేషమన్నారు. జంధ్యాల నగరంలోని ప్రభుత్వ కళాశాలలో చదువుకున్నారన్నారు. తెలుగు వారి హాస్య చతురత ప్రపంచానికి తెలియ జేశారని కొనియాడారు. 23కు పైగా జాతీయ స్థాయి అవార్డులు గెలుచుకున్నారన్నారు. కళామంజరి వ్యవస్థాపకుడు పీవీఎల్ నృసింహం మాట్లాడుతూ చిరంజీవిలాంటి మెగా స్టార్‌తో హాస్య చిత్రానికి దర్శకత్వం వహించడం ఆయనకే చెల్లిందన్నారు. కార్యక్రమంలో రంగస్థల నటుడు ఆచంట బాలజీ నాయుడు, చివుకుల హరగోపాల్ పరచూరి విజయలక్ష్మి, గాయకుడు కుమార్‌తోపాటు జంధ్యాల అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత జంధ్యాల విగ్రహానికి నివాళి సమర్పించారు. అనంతరం పేదలకు అన్న, వస్త్ర దానం నిర్వహించారు.



జంధ్యాల విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న వేముల హజరత్తయ్య గుప్తా తదితరులు

• ప్రమాదం అంచున విహారం



ఈత ఆరోగ్యదాయకమే.. అయినా అది ఎక్కడ చేయాలో.. ఏ పరిస్థితుల్లో చేయాలో అక్కడే చేయాలి. నదీ గర్భాల్లో.. అధిక లోతు, సుడిగుండాలు ఉండే ప్రాంతాల్లో సరదాగా ఈతకు దిగితే ప్రాణాల మీదకు వస్తుంది. ఈ చిత్రం చూడండి.. కృష్ణలంక, తాడేపల్లి మధ్య ఉన్న కృష్ణా నదిలోని గుంటల్లో చిన్నారులు ప్రమాదకరంగా స్నానాలు చేస్తున్నారు. ఆ ప్రదేశంలో లోతు ఎక్కువగా ఉండటంతో చాలా మంది స్నానాలకు దిగి ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు. ఇప్పటికైనా పెద్దలు పిల్లలకు ప్రమాదాలపై అవగాహన కల్పించడంతోపాటు అప్రమత్తంగా వ్యవహరించాలి. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పెండ్యాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

పెండ్యాల(కంచికచర్ల) : మండలంలోని పెండ్యాల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవో విద్యాల భాగ్యరేణుక మాట్లాడుతూ ఇప్పటివరకు అంగన్‌వాడీ ప్రీస్కూల్‌లో చదివి ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేర్పిస్తున్నామని తెలిపారు. అంగనవాడీ కేంద్రాల ద్వారా చిన్నారులతోపాటు గర్భిణులు, బాలింతలకు పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నామన్నారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను నేర్పిస్తున్నామన్నారు. కేంద్రాల్లో ప్రీ స్కూలు మెటీరియల్ ఎగ్జిబిషన్‌లు నిర్వహించి చిన్నారుల తల్లులకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగనవాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కరీమా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లోపాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు

'చెంబేటి' సేవలు మరువలేనివి

దబ్బాకుపల్లి(వత్సవాయి) : మాజీ ఎంపీపీ చెంబేటి వెంకటేశ్వర్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కొనియాడారు. చెంబేటి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని దబ్బాకుపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉదయభాను పాల్గొన్నారు. వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ గ్రామంతోపాటు మండలంలో కూడా వైఎస్సార్ సీపీ బలోపేతానికి చెంబేటి వెంకటేశ్వర్లు విశేషంగా కృషిచేశారని వివరించారు. కార్యక్రమంలో మాజీ కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ పండగ శ్రీను, సయ్యద్‌బాబు, సునీల్, చెంబేటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



'చెంబేటి'కి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉదయభాను

ఎమ్మెల్యే తాతయ్యను కలిసిన రేషన్ డీలర్లు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంతోపాటు నియోజకవర్గంలో ఉన్న రేషన్ డీలర్లు బుధవారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. రాష్ట్రంలో ఉన్న 30వేల డీలర్ల భవిష్యత్ కోసం రేషన్‌ను రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసినవారిలో రేషన్ డీలర్ల సంఘ ప్రతినిధులు అన్నెపాగ ప్రకాశరావు, పాపినేని శ్రీనివాసరావు, తాటి రామారావు, బొడ్డు కొండయ్య, బందం నాగేశ్వరరావు, అరిగెల శ్రీనివాసరావు, వడ్డీ కాసులు, పట్టణ, నియోజకవర్గంలోని మూడు మండలాల డీలర్లు ఉన్నారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలోని మండలాలలో వివిధ గ్రామాలకు చెందిన విలేజ్ మొబైల్ బుక్ కీపర్లు, ఎమ్మెల్యే తాతయ్యను ఆయన నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



ఎమ్మెల్యే తాతయ్యకు వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

మద్యం సీసాలు ధ్వంసం



మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న డోజర్



కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఎస్‌ఈబీ అధికారులు

జగ్గయ్యపేట అర్బన్ : గత ఏప్రిల్ నెలలో జగ్గయ్యపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో నమోదు చేసిన 52 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 1752లీటర్ల మద్యం, 67.75 లీటర్ల బీరు, 7.5 లీటర్ల తాటి కల్లును బుధవారం ధ్వంసం చేశారు. తిరుమలగిరి సమీపంలోని ఆటోనగర్ వద్ద డోజర్‌తో ధ్వంసం చేయించినట్లు ఎస్‌ఈబీ సీఐ మణికంఠరెడ్డి తెలిపారు.

రేపటి నుంచి ఇండియన్ స్టార్టప్స్‌పై అంతర్జాతీయ సదస్సు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కాకరపర్తి భావనారాయణ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో 'ఇండియన్ స్టార్టప్స్ - సమస్యలు - సవాళ్లు - అవకాశాలు' అంశంపై అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు చెప్పారు. ఈ సందర్భంగా ఆ కళాశాల కమిటీ కార్యాలయంలో సదస్సు పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ పారిశ్రామిక రంగ అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం స్టార్టప్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతలోని నూతన ఆలోచనలకు ప్రోత్సాహాన్ని అందించి పారిశ్రామిక రంగం వైపు అడుగులు వేసే దిశగా తీర్చి దిద్దుతున్నాయన్నారు. ఆ క్రమంలో స్టార్టప్స్‌కు సంబంధించిన అనేక అంశాలపై సుదీర్ఘమైన చర్చ జరగాల్సిన అవసరముందన్నారు. తద్వారా పారిశ్రామిక రంగానికి యువత అభ్యున్నతికి మేలు జరగుతుందన్నారు. ఆ క్రమంలో తమ కళాశాల ఆధ్వర్యంలో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు మాట్లాడుతూ అంతర్జాతీయ సదస్సుకు సంబంధించి 21వ తేదీన జరిగే ప్రారంభ సభకు స్థానిక శాసనసభ్యుడు, మాజీ కేంద్ర మంత్రి వై. సత్యనారాయణ (సుజనా)చౌదరి ముఖ్యఅతిథిగా, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సదరన్ రీజనల్ సెంటర్ డైరెక్టర్ ఆచార్య బి. సుధాకర్‌రెడ్డి గౌరవాతిథిగా హాజరవుతారన్నారు. అదేవిధంగా మలేషియాకు చెందిన ఏషియన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆచార్యులు షరన్‌కుమర్‌షెట్టి కీలకపోన్యాసకునిగా, యుఎస్ఏకు చెందిన ఆచార్య సత్య నారాయణ పరియిటమ్ ప్రధాన వక్తగా పలు విశ్వవిద్యాలయాలు, పారిశ్రామిక సంస్థలకు చెందిన ప్రముఖులు వక్తలుగా హాజరవుతారని వివరించారు. రెండో రోజు జరిగే ముగింపు సభకు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ రెగ్యులేటరీ అండ్ మోనటరింగ్ కమిషన్ మెంబర్ సెక్రటరీ అండ్ సీఈవో ఆచార్య డి. సూర్యచంద్రరావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని వివరించారు. కార్యక్రమంలో కమిటీ ప్రముఖులు హరగోపాల్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేష్, అధ్యాపకులు హేమంత్‌కుమార్, అరుణ్ కుమార్, రవికిరణ్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తూనికుంట్ల శ్రీనివాసు

వాహనాల వేలం ద్వారా రూ 99వేలు ఆదాయం

జగ్గయ్యపేట అర్బన్: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 18న నిర్వహించిన వేలంపాటకు అనూహ్య స్పందన లభించిందని స్పెషల్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జగ్గయ్యపేట సీఐ మణికంఠరెడ్డి బుధవారం తెలిపారు. 8 ద్విచక్రవాహనాలు, ఆటోలకు నిర్వహించిన బహిరంగ వేలానికి ప్రభుత్వం నిర్ణయించిన రూ.62,500 ధరకుగాను వేలం ద్వారా రూ.98,800 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అనగా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు 58.08శాతం పెరుగుదల కనిపించిందన్నారు. అదేవిధంగా జీఎస్టీ రూపంలో రూ.17,784 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

23న ఉచిత కంటి వైద్య శిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): అజిత్‌సింగ్‌నగర్ విశాలాంధ్ర కాలనీలోని ఎస్‌జీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఈ నెల 23న వన్‌టౌన్‌లోని అయాన్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు హాస్పిటల్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంత్ శర్మ తెలిపారు. ఈ శిబిరంలో ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ బషీర్ పాల్గొని కంటి పరీక్షలు చేస్తారని తెలిపారు. కంటికి సంబంధించి అన్ని సమస్యలు నీటి కాసులు, నల్లగుడ్డు, మెల్లకన్ను, మైగ్రేన్‌లతో పాటు డయాబెటిక్, హైపర్‌టెన్షన్‌ల రెటీనోపతి వంటి దృష్టిలోపాలకు అధునాతన వైద్య యంత్ర పరికరాలతో పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇస్తారని రజనీకాంత్‌శర్మ తెలిపారు. శస్త్రచికిత్సలు, కళ్లజోళ్లు అవసరమైన వారికి రాయితీపై చేయనున్నట్లు పేర్కొన్నారు.